# మినీకథ

## ఉద్యోగం

దేవరకొండ గంగాధర రామారావు




వాసంతి ఉత్సాహంగా ఫోనులో తన స్నేహితురాలు సరోజతో అంది "సరూ, ఓ శుభవార్త. నాకు ఉద్యోగం దొరికింది!"

సరోజ ఈ వార్త వెంటనే నమ్మలేక పోయింది అనుమానంగా అంది- "నువ్వింకా బి.ఏ పూర్తిచేయలేదుకదే! మరి యీ రోజుల్లో ఎమ్మేలకే ఉద్యోగాలు దొరక్క...." వాసంతి మధ్యలో అంది "నిజమేననుకో. మా నాన్న వాళ్ళనీ. వీళ్ళనీ పట్టుకుని. ప్రాధేయపడి ఏదో కాస్త సమర్పించుకుని ఎలాగో నాకీ ఉద్యోగం...."సరోజకి చాలా కోపం వచ్చింది- "యూ ఫూల్ మీ నాన్న లంచాలంటే మండిపడతాడని చెప్పావుకదా. మరి ఎందుకిలా దిగజారిపోయాడు?"

వాసంతి బాధగా అంది- "అవును దిగజారి పోయాడు నా కోసం. నా భవిష్యత్తు కోసం తన ఆదర్శం మంటగలిసిపోయిందని బాధ పడ్డాడు. కాని దగ్గరవాళ్ళంతా పట్టుబట్టారు. 'ఇదీ ఒక సంప్రదాయమేనయ్యా' అని నచ్చించారు"

సరోజ ఆవేశంతో రెచ్చిపోయింది. "ఛీ! లంచాలివ్వడం. పుచ్చుకోవడం సంప్రదాయమా? యిట్ యీజ్ ఏ షేమ్! అట్రాషస్!" అని ఆవేశం తగ్గించుకుని ఓ నిట్టూర్పు విడిచి మళ్ళీ అంది "ఓ.కే మీ ఆదర్శాలు ఎలాపోతే నాకేమిటిగాని. నీ లంచగొండి ఉద్యోగం ఏమిటో కాస్త వివరంగా అఘోరించు!" అంది. "ఉద్యోగం అంటే .... కేవలం ఉద్యోగం కాదనుకో....అదొక కాంట్రాక్టు లాంటిది. అంటే నా బాస్‌కి నేను పి. ఏ. లాంటిదాని నన్నమాట"

"అంటే నీ బాస్ చెవిలో 'పి' అంటే పాటలు పాడే 'ఏ' అంటే అమ్మాయివా? సరిగ్గా ఏడు!" అంది సరూ వెటకారంగా.

"అవును నువ్వంటేగుర్తొచ్చింది నేను పాటలు కూడా పాడాలి. నా బాస్ అవసరాలన్నీ చూడాలి ఆయనకి బ్రేక్‌ఫాస్ట్. లంచ్. మధ్యాహ్నం టిఫిన్....అన్నీ సమయానికి సమకూర్చాలి."

సరోజకి ఓర్పు హరించిపోతోంది. "అంతేనా. యింకా...."

"ఆ! యింకా చాలా ఉన్నాయి నా డ్యూటీలు. ఆయనకి కోపంతెప్పించకూడదు. ఎప్పుడూ నవ్వుతూ. సరదాగా ఉండాలి. ఆయన్ని మంచి మూడ్సులో ఉంచాలి. అంతే కాదు. వాళ్ళ అమ్మా. నాన్నా వస్తే వాళ్ళనీ జాగ్రత్తగా చూడాలి. ఆ! మరిచి పోయాను ముందుముందు నా బాస్‌కి పిల్లలు పుడితే వాళ్ళ సంరక్షణంతా నాదే. వాళ్ళకి స్నానాలు చేయించాలి. డ్రెస్సులు వేయాలి. స్కూళ్ళకి పంపాలి. జ్వరాలూ. రొంపలూ వస్తే సపర్యలు చెయ్యాలి. యింకా ..."

సరోజ యిక వినలేకపోయింది. "నీ ఉద్యోగం సంగతి వింటుంటే నా ఒళ్ళు మండిపోతోంది. నీ కిష్టమైతే నీ బాస్‌గాడి జోళ్ళు కూడా పాలిష్ చేసి నెత్తిన పెట్టుకుని ఊరేగు! అయి డోంట్ కేర్! యింత బండ చాకిరీ జీతమైనా బాగా గుంజుతున్నావా?"

వాసంతి తడబడింది. "జీతం అంటూ ఏమీ ఉండదుట. బతికున్నంత కాలం తిండి. బట్ట యిస్తారు. వైద్య సదుపాయం వాళ్ళదే. అందరితో మంచిగా వుంటే అన్ని సరదాలూ తీరుస్తారు. లేందే నోటీసు లేకుండా పంపేస్తారు!" యిది విని సరోజ. ఫోను పగిలిపోయేలా అరచింది "వాసంతీ యిదా నీ కాంట్రాక్టు! యిది ఉద్యోగంకాదే ఫూల్! దీన్నేమంటారో తెలుసా? బాండెడ్ లేబర్, వెట్టిచాకిరీ! యిది 'లా' ప్రకారం విరుద్ధం. కాగితాలూ అవీ సంతకాలు చేసేశావా? ఆ కాగితాలు వాళ్ళమొహాన కొట్టు. నిన్ను మోసం చేసినందుకు వాళ్ళని కోర్టుకీడ్చి...."

ఇంక సరోజ మాటలు భరించలేక వాసంతి గంభీరంగా అంది. "సరూ! ఆపు నీ వాగ్ధాటి ఆ మాత్రం నాకు తెలుసు కానీ ఈ కాంట్రాక్టు చింపెయ్యడానికీ. మార్చెయ్యడానికి కుదరదు. బంధుమిత్రుల సమక్షంలో. మంగళ వాద్యాల మధ్య. వేద ఘోషతో దీవెనలూ అక్షింతలూ కురుస్తుంటే నేనూ, నా బాస్ ఒక శుభముహూర్తాన చేసుకునే ప్రమాణం- నాతి చరామి! అది యీ నెల"

సరోజ కొన్ని క్షణాలు ఉక్కిరిబిక్కిరై తేరుకుని "కంగ్రాట్స్" అంది